క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయుడికి జాతీయస్థాయి అవార్డు



కృష్ణా: మండలంలోని కున్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌కు జాతీయ ఉత్త ఉపాధ్యాయుడు అవార్డు వచ్చింది. సౌత్ ఇండియా బహుజన రైటర్స్, సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగానే ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అవార్డును ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నట్లు పేర్కొన్నారు.

ఎక్లాస్‌పూర్‌లో బోర్ డ్రిల్లింగ్

నారాయణపేట: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో నీటి ఎద్దడిని తీర్చాలని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద బోరు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. సోమవారం తిమ్మప్ప స్వామి దేవాయలం వద్ద బోర్ డ్రిల్ చేశారు. కార్యక్రమంలో సదాశివారెడ్డి, గౌస్, రాములు, భాస్కర్‌రెడ్డి, ఊశప్ప, అశోక్, లక్ష్మణ్, బాలకిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ జయంత్యుత్సవాలు



ధన్వాడ: మండల కేంద్రంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయలో జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, మహామంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం డోలారోహణం నిర్వహించారు. అనంతరం అన్నదనం చేశారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో మార్కండేయ జయంతిని సోమవారం నిర్వహించారు. మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఎంపీడీఓకు సన్మానం



మక్తల్: ఊట్కూర్ మండల పరిషత్ భవనంలో సోమవారం ఎంపీడీఓ రమేష్‌కుమార్‌కు పంచాయతీ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈయన ఆదివారం రాత్రి వెలువడిన ఉత్తర్వుల్లో గద్వాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కొండన్న, ఎంపీఓ రాజు, నర్సింహారెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

కోస్గి: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఇంటి పన్ను చెల్లింపు కోసం యజమాని, తండ్రి పేరు, ఇంటి నంబర్, ఇంటి కొలతలకు సంబంధించి ఎలాంటి తప్పులు ఉన్న సవరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తున్నామని వారంలో ప్రతి సోమవారం, బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: చుట్టు పక్కల వారితో రేషన్‌బియ్యం సేకరించి అక్రమంగా ఇంట్లో నిల్వ చేయగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం మేరకు దాడులు నిర్వహించి బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఏఎస్‌ఐ ఉస్మాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దోరేపల్లికి చెందిన షేక్‌బాబా రేషన్ బియ్యాన్ని సేకరించి ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆరు కింట్వాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనందం ఫిర్యాదు మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆయనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

పాలమూరు హస్తగతం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు పాలమూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. కొత్త చైర్మన్‌గా ఎ.ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా షబ్బీర్‌అహ్మద్ ఎన్నికయ్యారు. గత నెల 6న అప్పటి చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్‌లపై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్ రవినాయక్‌ను 30 మంది కౌన్సిలర్లు కలిసి నోటీసులు అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు గత నెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించగా వీరిద్దరిపై అవిశ్వాసం నెగ్గింది. చివరకు సోమవారం కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మొత్తం 49 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వీరిలో చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్ (21వ వార్డు కౌన్సిలర్)కు 32మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తమ మద్దతు పలికారు. బీజేపీకి చెందిన ముగ్గురు సభ్యులు రామాంజనేయులు, ఎ.అంజయ్య, కొల్లె చెన్న వీరయ్య మాత్రం తటస్థంగా ఉన్నారు. అలాగే 1.30 గంటలకు వైస్ చైర్మన్‌గా షబ్బీర్‌అహ్మద్ (19వ వార్డు కౌన్సిలర్)కు 30 మంది ఓటేశారు. మరో ముగ్గురు సభ్యులు ఉమర్‌పాషా (12 వార్డు), వడ్ల రష్మిత (22వ వార్డు), ఎస్.పద్మ (28వ వార్డు) గైర్హాజరయ్యారు. అనంతరం కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో మున్సిపల్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు మరోవర్గంలోని చైర్మన్ అభ్యర్థి కె.వనజ (ఐదో వార్డు)కు, వైస్‌చైర్మన్ అభ్యర్థి రావుల అనంతరెడ్డి (22వ వార్డు)కి మిగిలిన 14 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మద్దతు పలకగా ఓటమి చవిచూశారు.



చైర్మన్, వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు

పటిష్ట బందోబస్తు

ఉదయం 10.30 గంటలకు ఒకవర్గంలోని 14 మంది కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. 11 గంటలకు ఆనంద్‌గౌడ్ వర్గంలోని 32 మంది కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో వచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలీసులు మున్సిపల్ కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు వర్గాల కౌన్సిలర్లు వచ్చినా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే లోపలికి మీడియాను ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీసులు అనుమతించలేదు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

కోస్గి: నియోజకవర్గాన్ని విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చేయడంలో భాగంగా కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటును హర్షిస్తూ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పాలాభిషేకం చేశారు. ఎంతోమంది గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ముఖ్యంగా బాలికలు ఇంటర్‌తోనే తమ చదువులు ఆపివేస్తున్నారని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుతో బాలికలు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ దీప సంకల్ప దినోత్సవం



దీపాలు వెలిగిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

నారాయణపేట: ఎల్ఐసీ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన దీప సంకల్ప సప్తాహ పురస్కరించుకుని సోమవారం పట్టణ బ్రాంచ్ ఆఫీసులో దీపాలు వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఎం రమేష్, తేజ, కాశీనాథ్, హన్మంత్‌రెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి



కోస్గిలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఊట్కూర్‌లో దేవయజ్ఞం నిర్వహిస్తున్న ఆర్యసమాజ్ సభ్యులు

కోస్గి: స్వామి దయానంద సరస్వతి జయంతిని పురస్కరించుకుని సోమవారం గుండుమాల్ మండల కేంద్రంలోని దయానంద విద్యా మందిర్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామి దయానంద సరస్వతి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

మక్తల్: ఊట్కూర్ మండల కేంద్రంలో ఆర్యసమాజ్ భవనంలో సోమవారం స్వామి దయానంద సరస్వతి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయజ్ఞం చేపట్టారు. అధ్యక్షుడు కనకప్ప ఆర్య మాట్లాడుతూ దయానంద సరస్వతి జన్మించి 200 ఏళ్ల పూర్తయిందని ఈ ఏడాది ద్విశతాబ్ది ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆర్య సమాజ్ ప్రచారాన్ని దయానంద్ సరస్వతి రాసిన సత్యార్థప్రకాశ్ ప్రాముఖ్యతను, అలాగే యజ్ఞం యొక్క విశిష్టతను తెలుపుతామన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, జ్ఞానేశ్వర్, రాంమనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, వెంకటేష్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలగని సెంట్రల్ లైటింగ్



చీకటి మయంగా మారిన గ్రామం

మాగనూర్: పట్టణ ప్రధాన రహదారుల్లో బటర్‌ఫ్లై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇవి వెలగడం లేదు. ఫలితంగా రహదారి చీకటిగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ లైట్లు గతేడాది నుంచి ఇదే తంతు ఉందని గ్రామస్తులు, వాహనాదారులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఇలా కావడం రెండో సారని లైట్లు కాలిపోవడానికి ముఖ్యమైన కారణం నిర్వహణ లోపమే అన్ని తెలుపుతున్నారు. అధికారులు ఇప్పటికైనా లైట్లకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నర్వ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నర్వ: యువకులు క్రీడలతో ఉద్యోగాలు, పేరు ప్రఖ్యాతలు సాధించవచ్చని పీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్‌పీఎల్ సీజన్-3 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడలలో పాల్గొనే యువతను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడు ముందుంటామని గ్రామ పెద్దలు, పార్టీల నాయకులు, దాతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, కృష్ణారెడ్డి, దండు అయ్యప్ప, నీరజ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతిభ హన్మంతురెడ్డి, డా.శంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాజాతా

నర్వ: గ్రామాల్లో చోరీల నిర్మూలనకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ చంద్రనాయక్ సూచించారు. సోమవారం సాయంత్రం పాత రేడ్ అంబేద్కర్ చౌరస్తాలో పోలీస్ కళాజాతా ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆటాపాటల ద్వారా ప్రజలకు చట్టాలపై వివరించారు. సైబర్ నేరాలపై ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై 1930, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రూక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని దస్తమ్మ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు రాకేష్ శర్మ తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల విభాగంలో రన్నింగ్ పోటీల్లో ప్రతిభ చూపింది. ఈమె 14వ తేదీన గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీఈటీ తెలిపారు. విద్యార్థిని సోమవారం హెచ్‌ఎం భానుప్రకాష్‌రెడ్డి, పీఈటీ, సీఆర్పీ దస్తయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బండలాగుడి పోటీలకు విరాళం



నర్వ: మండలంలోని ప్రసిద్ధ రాంపూర్ శరణు లింగ మహారాజ్ జాతర సందర్భంగా నిర్వహించే కాడెద్దుల పోటీలకు బీఆర్‌ఎస్ నాయకుడు దండు అయ్యప్ప రూ.లక్షను కమిటీ సభ్యులకు అందించారు. జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ రకాల కార్యక్రమాలతో పాటు ఏటా నిర్వహించే కాడెద్దుల పోటీలకు వితరణ చేయడంపై జాతర కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు.

నేటి నుంచి జములేశ్వరీమాత ఉత్సవాలు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరీ మాత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం భక్త మార్కెండేయ స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ఆభరణాలను అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రతి ఏటా నెల రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి మంగళ, శుక్రవారాలలో అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహులు తెలిపారు.

ఎంపీ స్థానం బీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న నర్సింహులు యాదవ్

నారాయణపేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ పార్టీ అధిష్టానం బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్ల నర్సింహులు యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అధికంగా బీసీ ఓటర్లు ఉన్నారన్నారని, బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయిస్తే ఖచ్చితంగా బీసీలు అందరూ ఏకతాటిపైకి వచ్చి గెలిపించుంటామన్నారు. బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయించని పక్షంలో జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయం, రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బాల్‌చందర్, సంగప్ప, బాలరాజు, ఆశప్ప, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘ కాలిక రుణాలపై దృష్టి సారించాలి

చిన్నచింతకుంట: దీర్ఘకాలిక రుణాలపై అధికారులు దృష్టి సారించాలని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక రుణాలు రికవరీ చేయాలని సూచించారు. అనంతరం సంఘానికి సంబంధించిన ఖాళీ స్థలంలో కొందరు అక్రమంగా హోటళ్ల, డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారని... ఖాళీ చేయించాలన్నారు. నిలిచిన గోదాం నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని తీర్మానం చేశారు. వైస్ ప్రెసిడెంట్ రామలింగారెడ్డి, సభ్యులు నెల్లి శ్రీనివాస్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, గూడూర్ రాములు, సంఘం సీఈఓ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నరేందర్

కోయిల్‌కొండ: ట్రస్మా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నరేందర్, ఉపాధ్యక్షుడిగా కనకయ్య, కార్యదర్శిగా రాంచందర్, కోశాధికారిగా రాజేష్, సంయుక్తకార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, మీడియా ప్రతినిధిగా లాలు, చీఫ్ అడ్వైజర్‌గా వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

చెరువు శిఖం సర్వే

సాక్షి ఎఫెక్ట్..



అమ్మపల్లి చెరువులో సర్వే చేస్తున్న అధికారులు

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి గ్రామ చెరువు కుంట శిఖం.. అన్యాక్రాంతం అనే వార్తను సోమవారం సాక్షి దినపత్రికలో రావడంతో స్పందించిన కలెక్టర్ వెంటనే సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వేయర్ జయశంకర్, ఆర్ఐ శ్రీశైలం సర్వే నిర్వహించారు. ప్రస్తుతం చెరువును ఆక్రమించుకుని సాగు చేస్తున్న భూమి 1.7 ఎకరాలుగా గుర్తించారు. సదరు రైతులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. వీటితో పాటు వడ్వాట్ చెందిన ఓ రైతు దాదాపుగా 12 ఎకరాల మేర చెరువులో గుంటిలు ఏర్పాటు చేశారని అమ్మపల్లి గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆ భూమి సాగులో లేనందున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం లేదని తెలిపారు. ఒక వేళ ఆ భూమిలో సాగు చేస్తే వారిపై కఠినచర్యలు తప్పవని అన్నారు. మంగళవారం ఇరిగేషన్ అధికారులతో హద్దులు గుర్తిస్తామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సతీష్‌కుమార్

మాగనూర్: గ్రామాల్లోని తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువులో రాణించాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన బాలుర వసతి గృహంలో విద్యార్థులకు బూట్లు, సాక్స్, చెప్పులు తదితర వస్తువులను పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పిల్లల నుంచి ఒక్కటే కోరుకుంటారని అది వారు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రమ శిక్షణతో చదివి గొప్పస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, గురువులకు సమాజంలో మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వసతి గృహంలో ఉండే విద్యార్థుల కోసం ప్రభుత్వం చాలా ఖర్చు చేసి ఇలాంటి వస్తువులను అందిస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మన్నన్, ఆర్ఐ శ్రీశైల, హాస్టల్ వార్డెన్ వెంకటేష్, అబ్జల్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



పేటలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట: పదేళ్లుగా సీఎంగా ఉండి ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ద్రోహం చేసిన కేసీఆర్ కృష్ణ జలలాపై నల్లగొండలో బహిరంగ సభను నిర్వహించడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష చూపి ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 40 శాతం పూర్తి చేయలేదన్నారు. కృష్ణా జలాలను అక్రమంగా ఆంధ్రాకు దోచిపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అరవై రోజుల్లోనే పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించడం నిబద్ధతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సదాశివారెడ్డి, కౌన్సిలర్ సలీం, మనోహర్‌ప్రసాద్‌గౌడ్, లిఖిరఘుబాబు, యూసుఫ్‌తాజ్, కల్యాణ్‌కుమార్, సాయిరెడ్డి, రాములు, వెంకట్రాములు, రాము అఖిల్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు రాజిరెడ్డి, చెన్నయ్యసాగర్ మాట్లాడుతూ.. దొందే దొంగ అన్నట్లుగా ఉందని పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి తాకట్టుపెట్టి రెండు నెలల కాంగ్రెస్‌ను పట్టుకుని మీరే చేశారనడం ఎంత వరకు సమంజసమని దుయ్యపట్టారు. గతంలో నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ గద్దెనెక్కి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నీరజ్, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

నారాయణపేట: స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా పి.కృష్ణదేవ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు ఉన్న రూరల్ ఎస్ఐ జయప్రసాద్ మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను ఎస్ఐ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

కోస్గి: బదిలీల్లో భాగంగా కొత్త ఎస్ఐగా శేఖర్‌గౌడ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న శ్రీనివాసులు నారాయణపేట వీఆర్‌కు బదిలీపై వెళ్లడంతో జోగులాంబ గద్వాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న శేఖర్‌గౌడ్ కోస్గికి బదిలీ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు, యువకులు, నాయకులు, అధికారులతో కలిసి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట: ఖమ్మంలో మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ యూనిటి మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రాము పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లోని జిల్లా కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), పీసీఐ ఎంఎల్ (ఆర్ఐ) మూడు విప్లవ పార్టీలు ఐక్యమై ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనే పేరును నిర్ణయించారన్నారు. ఈ పార్టీ యూనిటి మహాసభను ఖమ్మంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 3న వేలాది మందితో ప్రజాప్రదర్శన, మార్చి 4, 5న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మహాసభకు జిల్లాలోని కార్మికులు, ప్రజలు , మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాశీనాథ్, యాదగిరి, ప్రశాంత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.